# నోరులేని నిజం

జిల్లా జడ్జి ఆనందరావుగారు రాజీనామా యిచ్చారని పేపరులో పడ్డాది. ఆ విషయం చదివిన వాళ్ళంతమందీ ఆశ్చర్యపోయారు. అదీ వ్యక్తిగత కారణాలవల్ల అని ఒక మాటతో ముగించడం ప్రతివారికీ వింతగానే తోచింది.

ఆనందరావు కింకా వయసు దాటిపోలేదు. మంచి శరీర పుష్టి గలవాడు, హోదా, డబ్బు, గౌరవం గల ఉద్యోగం వదులుకొని రాజీనామా యివ్వాల్సిన అవసర మేమొచ్చిందా అని అందరికీ కావలసిన విషయం-

కాని...

*  *  *  *

కార్తీక బహుళ షష్ఠి—

రాత్రి పది గంటలు దాటుతున్నది. ఆనందరావు తీరుబాటుగా డాబా మీద పచారు చేస్తున్నాడు— తోడుగా భార్య మీనాక్షి కూడా వున్నది. భార్యాభర్త లిద్దరూ ఆ డాబా మీద మాటాడుకుంటున్నారు— ఆ చీకట్లో అతను కాలుస్తున్న ఎర్రటి సిగరెట్టు కొడివల్ల తప్ప ఆ రోడ్డు మీద పోతున్న వారికి— ఆ డాబా మీద మనుషులున్నట్లు పోల్చుకోవడం కష్టం!

రోడ్డు మీద మాత్రం ట్యూబ్‌లైట్లు కాంతిలో వచ్చే పోయే జనం

బాగానే కనిపిస్తున్నారు. అప్పుడే సినిమా వదిలి వుంటారు. దూరదూరంగా గుంపులు గుంపులుగా ఇళ్ళకు పోతున్నారు జనం.

ఆనందరావూ, మీనాక్షి పిట్టగోడ మీదుగా వంగి వచ్చేపోయేవారిని చూస్తున్నారు. క్రింద విద్యుద్దీపాల వెలుగులోకి వస్తున్న మనుషులు మళ్ళీ చీకటిలోకి నడిచిపోతూ మాయమపోతున్నట్టున్నారు— ఆ వెలుతురులోనే వాళ్ళలో ఆడవాళ్ళు కట్టుకున్న చీరల గురించి, వారు నడిచే నడకల తీరు గురించి మీనాక్షి వ్యాఖ్యానిస్తూ వుంది. ఆనందరావు అప్పుడప్పుడు ఆ మాటలకి చిన్న నవ్వు నవ్వుతూ అటువైపు చూస్తున్నాడు.

రాను రాను జనం పలచపడ్డారు. ఆనందరావుకి ఆవులింతలు వస్తున్నాయి. చలి కూడా కొంచెం ఎక్కువవు తున్నట్టుందేమో "పదండి లోపలికి పోదాం!" అంది మీనాక్షి.

ఇంక పోదాం అని యిద్దరూ అనుకుంటూ వుండగా దూరంగా వెలుగు నీడల మధ్య— రోడ్డు మలుపు తిరిగే దగ్గర... ట్యూబ్ లైటు వెలుతురులో... జట్టు కట్టుకు వస్తున్న యిద్దరు వ్యక్తులలోనూ ఒకడు కెవ్వున కేక కేక వేసి నేలకూలాడు. కూడా వున్న వ్యక్తి గాభరాతో చేసేదిలేక, ఏమీ చేయడానికి తోచక పడిపోతున్నన్న వాడిని పట్టుకో బోయాడు.

వారి వెనుక కొంత దూరం నుండి వస్తున్న జనం— దగ్గరికి వచ్చేలోపున... పొడిచిన వ్యక్తి చీకటిలో కలిసిపోయాడు—

ఆనందరావు కళ్ళారా చూశాడు... మీనాక్షి లోపలికి పోదామని అంటున్నప్పుడే అతని దృష్టి ఆ వస్తున్న ఇద్దరి మీదా అప్రయత్నంగా పడింది. అటు వయిపు ఎందుకో చూస్తూనే లోపలికి పోయే ముందు— దృష్టి అలాగే నిలిచిపోయింది...అక్కడ జరిగిన దృశ్యం మీద!

ఆ యిద్దరూ ఆ సందు మలుపు తిరిగేసరికి ఆ ప్రక్క నుండి ఒక కాకి నిక్కరు మనిషి గభాలున పులిలా వచ్చి- ఒకడి మీద పడి మెడ మీద కత్తితో పొడిచి వెంటనే మెరుపులా పారిపోవడం కళ్ళారా చూశాడు!

మీనాక్షి కూడా అది చూసి "అయ్యో చంపేశాడండి !" అని అంటూ భర్తకు దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకుంది. అంత కార్తీకమాసం చలిలోనూ ఆనందరావుకి సహితం ఆ దృశ్యం చూసేసరికి ముచ్చెమటలు పోశాయి. జిల్లా జడ్జిగా, ఖూనీ చేసినందుకు ఎంతమందికి ఉరిశిక్షలు వేసినా కళ్ళారా ఖూనీ చూసి ఎరగడు. కత్తిపోటుకు గురి అయి విలవిలా తన్నుకు పడిపోయిన ఆ వ్యక్తిని చూడ్డం తటస్థించింది— మరి చూడలేక పోయినాడు.

* * * *

ఇంతలో ఆ ఘోరం జరిగిన స్థలానికి నలుగురూ మూగడం, గోల జరగడం, ఆ వెనకనే పోలీసులు రావడం జరిగింది.

కత్తిపోటు తిన్న వ్యక్తి రక్తంలో పడి కొట్టుకు చచ్చాడు. తోడనే వున్న వ్యక్తి అకస్మాత్తుగా జరిగిన సంఘటనకి బిక్కచచ్చిపోయి ఆ ప్రక్కన కళ్ళప్పగించి చూస్తూ భయంతో కూర్చుండిపోయాడు. అతని బట్టలన్నీ రక్తంతో తడిసిపోయినాయి. అతనికి ముచ్చెమటలూ పోసి నోటంట మాటలు రావడంలేదు. పోలీసులు కుదిపినా ఒకంతటికిగాని అత నికి తెలివి రాలేదు- అయినా తడబాటుతో, భయంతో ఏమీ చెప్పలేక పోయాడు. ఆ పోలీసులు- "ఎందుకు ఖూనీ చేశావు ! ఎందుకు పొడి చావు ?" అని ఒకటే అడుగుతున్నారు! ఏం చెపుతాడు పాపం?

అతను మరీ వశం తప్పి అలా చూస్తూ ఉండిపోయేసరికి— చుట్టూ మూగిన వారిని విషయం అడిగారు... వారూ పొడిచిన వాడిని చూస్తేగా చెప్పడానికి.

"ఏమో యిద్దరూ మొదట్నుంచీ కలిసే వస్తున్నారు- ఇక్కడికి వచ్చేసరికి యీతడు అరచి పడిపోయాడు- మేం ఆ అరుపు వినేసరికి యీ ప్రక్కని యితడేగాని మరెవరూ కనబడలేదు ! ఎందు కిలాటి పని చేశాడో మాకు తెలీదు!" అని చెప్పేడు.

ఆ వ్యక్తిని, శవాన్ని, ఆ ప్రక్కనున్న కత్తిని పోలీసులు పట్టుకుపోయారు.

* * * *

గడచిన రాత్రి చూసిన దృశ్యాన్ని నెమరువేసుకుంటూ ఆలోచిస్తూ ఆనందరావు కోర్టుకు వెళ్లాడు... యిలా వెళ్ళి కూర్చున్నాడో, లేదో-పోలీస్ ఇన్‌స్పెక్టరు వచ్చి నమస్కారం చేశాడు. ఆనందరావు అది అందుకుని- ఆ ప్రక్కన బేడీల్లో వున్న వ్యక్తిని చూడగానే గతుక్కుమన్నాడు. అతని కళ్ళు తిరిగిపోయినాయి. ఒక్కసారి కుర్చీ మీంచి లేచాడు... అడుగు ముందుకు వేయబోయాడు...మళ్ళీ ఆవేశం చాలించుకుని నిట్టూరుస్తూ కూర్చున్నాడు.

"ఈయన రాత్రి ఒక వ్యక్తిని కత్తితో పొడిచి చంపగా పోలీసులు పట్టుకున్నారు సార్" అని ఆ వ్యక్తిని బోనులో నిలబెట్టాడు ఇన్‌స్పెక్టర్.

ఆ మాట విని—"హత్యా! ఈయనా?" అని ఆతృతతో ప్రశ్నించాడు ఆనందరావు.

"ఈయనేనండీ- హత్య మీ వీధి దగ్గరే జరిగింది. ప్రక్కనే నడుస్తున్న గోపాలం అనే వ్యక్తిని పొడిచి చంపగా అక్కడివారు కొందరు చూశారట... పారిపోయేలోగా పోలీసులు పట్టుకున్నారు... ఇతని పేరు శంకరం."

శంకరం ఆనందరావుని చూసి కొయ్యబారిపోయాడు భయంతో.

ఆనందరావుకేం పాలుపోలేదు-

"ఎవరు చెప్పేరు? ఈయన హంతకుడని? అబద్ధం!" అని గట్టిగా అరుద్దామనుకున్నాడు... కాని మెల్లిగా...అబద్ధం అబద్ధం అని గొణుగుక్కున్నాడు-

"నిన్న రాత్రి పది- పదిన్నర ప్రాంతంలో కొత్తపేట, పెద్ద వీధి సందు మలుపులో యీతను గోపాలం అనే వ్యక్తితో కలసి వస్తూ ఆ సందు దగ్గరికి వచ్చేసరికి... పొడిచేసేడని- గోపాలం అరచి పడిపోగా

వెనకాల దూరం నుండి వస్తున్నవాళ్ళు ఆ కేక విని వచ్చి యీతనిని చూసి పట్టుకున్నారని సాక్ష్యం వుంది" అని వివరించాడు ఇన్‌స్పెక్టర్.

ఆనందరావు శంకర్రావు వయిపు చూశాడు... ఆ వ్యక్తి వెర్రి చూపులు చూస్తూ నిలుచున్నాడు!

అవును జ్ఞాపకం వస్తూంది. ఆ పొడవబడిన వ్యక్తితో కలసివస్తున్న వ్యక్తి యీతడే... అయితే యితడు నిర్దోషి- మోసం జరిగిపోయింది! హంతకుడు పారిపోగా అమాయకుడు పట్టుబడ్డాడు! అక్కడుండబట్టి యితన్నే అనుమానించారు. ఇది అన్యాయం! అని అనుకున్నాడు!

"వాళ్ళు చెప్పిందంతా నిజమేనా?" అని గద్గదికంగా అడిగాడు. ఆ చనిపోయిన వ్యక్తి ప్రక్కన యీత డుండడానికి కారణం తెలుసు కుందుకు అడిగాడు.

శంకర్రావు నోటంట చాలా సేపటివరకూ మాటలు రాలేదు! ఆఖరికి ఏడ్వడం మొదలెట్టేడు.

ఆనందరావూ మిగతావాళ్ళూ ఓదార్చగా ధైర్యం తెచ్చుకుని "రక్షించండి జడ్జిగారూ! నేనే పాపం ఎరుగను. నేను చంపలేదు. గోపాలం నా ప్రాణస్నేహితుడు! వాడిని నేను చంపుకుంటానా? ఏమిటో ఇదంతా అయోమయంగా వుంది. నాదీవూరుకాదు ఈ సాయంత్రం బండిలోనే వచ్చేను. స్టేషన్‌లోనే నా స్నేహితుడు గోపాలం కనిపించి సినిమాకు తీసుకుపోయాడు. సినిమా వదిలాక అతని యింటికి ఇద్దరం కలిసి వస్తూంటే, ఆ వీధి మలుపు తిరిగేసరికి ఎవడో ఆ ప్రక్క సందులో నుండి వచ్చి-గోపాలాన్ని పొడిచి, వెంటనే పారిపోయాడు. ఇదంతా ఒక్క తృటిలో జరిగిపోయింది. నేనేం చేసేందుకూ ఆలోచన పోలేదు! ఎదురుగుండా నెత్తురు చిమ్ముతూ కిందకి ఒరిగిపోతున్న నా స్నేహితుణ్ని పట్టుకు పడుకోబెట్టడం తప్పితే నేనేం చేసేందుకూ తోచ లేదు. నా వంటి నిండా కూడా రక్తమయింది. కత్తి యింకా మెడలోనే గుచ్చుకొని వుంది. గోపాలం బాధపడుతూ వుంటే చూడలేక దానిని పైకి లాగి కింద పడేశాను. తర్వాత ఏమీ తోచక అలా భయంతో వుండి

పోయాను! ఇంతలో పోలీసులు పట్టుకున్నారు—మేమిద్దరమూ అంత వరకూ కలిసి వస్తూండడమే మిగతా జనం చూశారుగాని, ఎవరు చంపారో ఎవరూ చూడలేదు. ఒక్క క్షణంలో పొడిచి పారిపోయాడు, ఎవరికంటా పడలేదు—నేనే చంపానని అన్యాయంగా అందరూ అంటు న్నారండి! ఇదే జరిగిన సంగతి నమ్మండిసార్. ఇంతకన్నా నేనింకేమీ ఎరుగను. మరో అయిదు నిముషాలు గడిస్తే మేము యింటికే పోయి వుండేవాళ్ళం... మీరు న్యాయమూర్తులు, నేను హంతకుడిలాగనే వున్నానా? నేను అంత పని చేయగలనా? అయ్యో దేముడా నాకేం దారి!... ఇది మీ చేతిలో వుంది, ఎలాగయినా తప్పించండి ఆజన్మాంతం మీకు కృతజ్ఞుడనయి వుంటాను..." అని దీనాతి దీనంగా అమాయ కంగా, జాలిగా, తన కథంతా చెప్పేడు శంకరం.

ఆనందరావు అంతా విన్నాడు. విననక్కర్లేకుండానే తనకు తెలుసు నిర్దోషి అని. కాని, అతనిని దోషిగా నిలుచోబెట్టేరు. అతనికి విరుద్ధంగా సాక్ష్యం వుంది. ఆనందరావుకేం తోచడంలేదు.

ఆవేళకు కేసులన్నీ వాయిదావేసి, ఏదో కారణం చెప్పి ఇంటికి వచ్చేశాడు.

కొద్దిసేపు పోయాక మీనాక్షికూడా ఆ సంగతి అడిగింది. "ఏమయింది, చంపినవాడు దొరికాడా?" అని కుతూహలంకొద్దీ. ఆనంద రావు జరిగినదంతా చెప్పాడు—

"అయ్యో ఎంత దురదృష్టవంతుడు? మీరూ చూశారుకదా? అతను నేరం చెయ్యలేదు. ఉత్తినే అతనికి శిక్ష వేస్తారా? మీరూ వూరు కుంటారా? అతనిని విడిపించలేరా? మీకామాత్రం అధికారంలేదా? వాడు హంతకుడు కాదని చెప్పి విడిపించండి. అన్యాయంగా ఒక అమాయకుడు బలి అయిపోతున్నాడే!" అని అమాయకంగా అన్నది.

"అవును అదే నేనూ ఆలోచిస్తున్నాను. కాని మనమిప్పుడేమీ చేయలేము. అతడు నిర్దోషి అని రుజువు కావలసి వున్నది. అతడేం

చేయలేదని—మనం చూశాం కాబట్టి చెబుతున్నాం. కాని ఆ సంగతి మరె వరూ చూడలేదు...పోగా అతను ఆ కత్తి తీయడం వలన దానిమీద హంతకుని వేలిముద్రలు చెరిగి ఇతనివే పడి వుంటాయి. అంచేత పొడి చిన వాడిని పట్టుకోడం కష్టం" అని అన్నాడు ఆనందరావు.

"అలాగని ఊరుకుంటారా. నేను కళ్ళారా చూశాను...నేను సాక్ష్యం పలుకుతాను...అతను నిర్దోషి అని..."

మనం సాక్ష్యం పలకడం అన్నది సామాన్య విషయంకాదు మీనాక్షి. అందులో ఎన్నో చిక్కులున్నాయి. ముఖ్యంగా, మన హోదా, సంఘంలో మనస్థానం, చట్టరీత్యా కొన్ని నిషేధాలూ, ఇలాంటివెన్నో అడ్డంకులున్నాయి. అది అంత సుళువుకాదు!"

అయినా కూడా మీనాక్షి వూరుకోలేదు. ఆమెలో ఆవేదన ఎక్కు వయింది.

"అయితే అమాయకుడు నిష్కారణంగా శిక్షించబడవలసిందేనా? చూస్తూ వూరుకున్న మనకు పాపముకదా? ఇలా జరగడానికి వీల్లేదు... ఒక జిల్లా జడ్జిగా మీకా అధికారం లేదా?"

"నాలాంటి వాడికి ఎన్ని అధికారాలు వుంటాయో అన్ని నిషే ధాలూ వుంటాయి. సామాన్యుడు, నాకన్నా ఎంతో స్వతంత్రుడు ఇలాంటి ఎన్నో విషయాల్లో. మీనాక్షి అయినా నా మనసు మాత్రం ఒప్పుతుందా? సాధ్యమయినంత వరకూ ప్రయత్నిస్తాను!" అని అప్ప టికి ఆ ప్రసంగం తప్పించి వూరుకున్నాడుగాని అప్పటినుండి, అతడిని ఎల్లా రక్షించడమా అని ఆలోచిస్తూనే వున్నాడు.

విషయం తెలిసిన శంకరం, తల్లిదండ్రులు గుండెలు బాదు కుంటూ ఆనందరావు కాళ్ళమీద పడ్డారు.

"మీరు ధర్మ స్వరూపులు తలుచుకుంటే రక్షించగలరు. మాకు పుత్రభిక్ష పెట్టండి!..." అని ఏడ్వడం మొదలెట్టేరు.

ఆనందరావు హృదయం కరిగిపోయింది.

"తన చేతిలోవున్నట్టు పైవాళ్ళకి కనబడినా అది అందుబాటు లోకి రావడానికి ఎంత కష్టమో ఎవరికి తెలుస్తుంది? అయినా వాళ్ళు ఇంతలా చెప్పాలా? ఒక నిర్దోషిని రక్షించడం తన విధిమాత్రం కాదూ? అది తన ధర్మంకాదా? అయినా తాను కేవలం నిమిత్త మాత్రుడు. ఉద్యోగరీత్యా చట్టబద్ధుడు. పరాధీనుడు. తన చేతనయినంతవరకూ ప్రయత్నించగలడు. కాని బలమయిన సాక్ష్యం, పరిస్థితులూ, శంకరానికి వ్యతిరేకంగా కనిపిస్తున్నాయి. తనూ తన భార్య తప్ప, హంతకుడిని చూసినవారు మరెవరూలేరు!... ఆ చీకట్లో మెరుపులా పారిపోయిన వ్యక్తిని పోల్చలేరు. హంతకుని పట్టుకునేందుకు అవకాశాలేమీ వున్నట్టు లేవు. ఇక దేముడొక్కడే వున్నాడు..." అని అనుకున్నాడు.

నిస్సహాయంగా బోనులోపడ్డ సింహంలా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు ఆలోచనలతో.

మంచి ప్లీడర్ని పెట్టి వాదించమని, తన సహాయం తప్పకుండా వుంటుందని చెప్పి వారిని ఓదార్చి, ధైర్యం చెప్పి పంపేడు.

అమాయకంగా కన్నీరు కారుస్తూ బోనులో నిలబడ్డ, శంకరాన్ని ఆశలన్నీ తనపైనే పెట్టుకొని విచారంతో కృంగిపోయిన అతని తల్లి దండ్రుల దుఃఖాన్ని చూసి కళ్ళారా చూసినాకూడా ఋజువుగా ఏమీ చేయలేని తన నిస్సహాయతకు, ఆనందరావుకి అసహ్యం కలిగింది.

ఎన్నాళ్ళు కేసును పొడిగించినా, శంకరం నిర్దోషి అని ఋజువు చేయడానికి తగిన ఆధారాలు దొరకడంలేదు. కేసు ఇన్వెస్టిగేషన్ ఆఖరికి అతనినే నేరస్తునికింద తేర్చివేసే స్థితికి వచ్చింది. ఆధారాలకోసం— ఎదురు చూసిన ఆశలన్నీ నిరాశలయినాయి. ప్రయత్నాలన్నీ నిష్ఫలా లయినాయి న్యాయ విచారణకి సాక్ష్యం ప్రధానంగాని, నిజం కాదని పించింది. తను ప్రస్తుతం చూసీ చూడని వాడయినాడు. కర్తవ్యం బోధ పడలేదు.

అటు ఋజువు పరచుకోలేని నిర్దోషి—ఇటు అబద్ధాన్నే నిజమని నమ్మించే సాక్ష్యం—అమాయకుడు శంకరం. అతనిమీద ఆధారపడ్డ

ముసలి తల్లిదండ్రులు. నిజంతో సంబంధంలేని చట్టం—ఈ పరిస్థితుల్లో ఆనందరావులోని మానవత్వానికి, కుర్చీలో కూర్చున్న జడ్జీ ఆనంద రావుకీ మనసులో ఘర్షణ ప్రారంభమయింది.

"ఇదంతా అబద్ధం! శంకరం నిర్దోషి! నేను కళ్ళారా చూశాను. ఎవడో పొడిచి కనబడకుండా పారిపోయాడు...అన్యాయంగా శంకరాన్ని అనుమానించారు...అతనికి శిక్షలేదు."

అని తీర్పు చెప్పగలడా?

"ఎవడా పారిపోయినవాడు? పట్టుకున్నారా? ఎవడో తెలుసా? శంకరం హత్య చేయనట్టు ఎవరయినా అక్కడున్నవాళ్ళు చూశారా?... అతను నిర్దోషి అని నిరూపించగలరా? ఏది రుజువు? అతను నిర్దోషి అని నిరూపించనంతకాలం అతను చట్టరీత్యా హంతకుడే! న్యాయశాస్త్రం నీ చేతిలో వుందా? అంతా నీ ఇష్టమేనా? నువ్వు సామాన్య మానవునిగా చూశావు? జడ్జిగా ఏంచేయగలవు?

ఈ ప్రశ్నలకు ఏం జవాబు వ్రాయగలడు?

ఎవరో నోరు నొక్కేసినట్టయింది తను కూర్చున్న స్థానం ముల్లుతో పొడుస్తూ తన బాధ్యతని గుర్తుకుతెస్తూంది.

ఈ కేసులో సాక్ష్యాలను వినగానే "సాక్షి" అన్న పదం మీద సాక్ష్యాలమీద నమ్మకం పోయింది.

తనకు తెలియకపోలేదు. వచ్చిన సాక్ష్యాలన్నీ నిజమయినవికావని కోర్టుచుట్టూ డబ్బుకోసం దొంగసాక్ష్యాలు చెప్పేవారు వుంటారు ఎన్నో కేసుల్లో వాళ్ళే చూసినట్టు సాక్ష్యం పలుకుతూ వుంటారు. వాళ్ళసంగతి తెలిసినా ఏంచేయగలుగుతున్నాడు?

ఒక్కొక్కప్పుడు వాళ్ళ దొంగసాక్ష్యాలను బట్టి తీర్పు ఇవ్వవలసి వస్తుంది. అందులో అబద్ధమెంతో నిజమెంతో—

వాళ్ళు చేసే ప్రమాణాలు, మాటాడే మాటలూ అలా వుంటాయి.

శంకర్రావు వైపు అనుకూలంగా ఒక్క సాక్ష్యంకూడా లేదు. అతనికి శిక్షవేయక తప్పదా? తనా కుర్చీలో కూర్చున్నంతకాలం సాక్ష్యాన్ని

బట్టి తీర్పు ఇవ్వడమేగాని, నిర్ధారణకాని నిజాన్ని ఆధారం చేసుకోలేదు కదా!

ముద్దాయి తల్లయినా, తండ్రియినా, భార్యయినా, కొడుకయినా, ఎవరయినా ఆ కుర్చీయొక్క బాధ్యత, విధి న్యాయశాస్త్రరీత్యా నిర్వర్తించక తప్పదు. అది అన్యాయమయినా...

"అన్యాయ మేమిటయ్యా! న్యాయ శాస్త్రానికిది న్యాయమే. దానికి చెవులున్నాయిగాని కళ్ళులేవు. ఇంతకుపూర్వం నువ్వెన్ని తీర్పులు చెప్పలేదు అవేవీ నువ్వు చూడలేదు కాబట్టి నువ్విచ్చిన తీర్పు నిజమయినదనే అనుకుంటున్నావు కాని...ఎంతమందికి అన్యాయం జరిగిపోయిందో తెలుసుకున్నావా? వాటన్నిటిలోనూ ఇదొకటి. ఊఁ నీవిధినిర్వర్తించు...' అని అంటూంది తన స్థానం.

"ఇదా నా విధి? ఒక అమాయకుణ్ని తగిన సాక్ష్యం లేకపోయినంత మాత్రాన శిక్షించడమేనా? అన్యాయాన్ని అరికట్టి న్యాయాన్యాయ విచారణ జరిపి నిజాన్ని చాటుతాంఅని అక్రమాలూ, దుర్మార్గాలూ అణిచి ధర్మాన్ని స్థాపిస్తాం అని గొప్పలు చెప్పకోడం, అందుకు తగుదునమ్మా అని ఇక్కడ కూర్చుని నిర్దోషిని శిక్షించడం, ఆత్మవంచన కాదా? నాలో మానవత్వం ఏమయింది? నిజంచెప్పే హక్కులేదా? మానవుని కనీస ధర్మాన్నికూడా మరచిపోవాలా? ఇదెక్కడి న్యాయం? చేతికి ఉద్యోగ ధర్మం అనే సంకెళ్ళు తగిలించి బలవంతంగా రాయించగలరా?"

ఈవిధంగా న్యాయన్యాయాల కర్తవ్య నిర్వాహణలో వుండే బాధ్యతతో సతమతమయిపోయాడు ఆనందరావు. కేసు మళ్ళీ వాయిదావేసి కుర్చీ దిగిపోయాడు.

మౌనంగా వెళ్ళిపోయాడు.

కోర్టుగంట అయిదు కొట్టింది...

క్రుంకిపోతున్న సూర్యుడిలాగ, అడుగున పడిపోయిన నిజాలు, మరుగు పడిపోయిన సత్యాలు ఎన్నో? అవి మరి పైకిరావు...రాలేవు... రానివ్వరు ఇక నిజం ప్రపంచానికి తెలిసేదెలా?

ఎంతో ఉత్కంఠతో తీర్పుకోసం వేచివున్న జనం తిరిగి విసుగుతో వెళ్ళిపోయారు...

ఆ తర్వాత ఆనందరావు రాజీనామా విని ఎంత ఆశ్చర్యపోయారో మళ్ళీ వాయిదాలో—

ఆ జిల్లాజడ్జి ఆనందరావుగారే ఒక సామాన్యుడిగా శంకరం నిర్దోషిత్వాన్ని రుజువు చేయడానికి సాక్షిగా బోనులో నిలబడ్డాడని వినగానే ప్రజలు మరీ ఆశ్చర్యపోయారు.

హెలికేక 17-4-70